

# ఇల్లు పాడుబడింది

మండపాక శివప్రసాద్

పడక కుర్చీలో కూర్చున్నాడేగాని కేశవరావు మనసు మనస్సులో లేదు. ఆలోచనలన్నీ కడ్తున్న ఇంటి చుట్టూ తిరుగుతున్నాయి. పునాదులు వరకూ లేచిన ఇంటిని ఎలా పూర్తి చెయ్యాలో అర్థంకాకుండా ఉంది. ప్రస్తుతం చేతిలో పైసా లేదు. తనకంటూ సొంత గూడుని ఏర్పరచుకోవాలని ఆయన చాలా కాలం నుంచీ తాపత్రయపడుతున్నాడు. ఆ తాపత్రయం వెనుక ఓ బలమైన కారణముంది. తినీ తినక కొంత డబ్బుని వెనకేశాడు. దాంతో సిటీలో ఓ మూల చిన్న స్థలాన్ని కొనుక్కున్నాడు. ధైర్యం చేసి ఇల్లు మొదలెట్టాడేగాని అది పూర్తయ్యే మార్గం కనుచూపుమేరలో కనబడలేదు.

ఆలోచనలలో నిండా మునిగి ఉన్న కేశవరావు వద్దకు కర్రపోటు వేసుకుంటూ విదురమ్మ వచ్చింది. గోడకు కర్రను ఆనించి కొడుకు పక్కనే కూర్చుంది.

"కేశవా... ఇల్లు ఎంతవరకూ వచ్చింది?" అంది విదురమ్మ వణుకుతున్న స్వరంతో.

"అప్పుడే ఎక్కడా... మొన్నేగా పునాదులు పని అయ్యింది."

"ఓ నెల పడుతుందంటావా.. త్వరగా పూర్తి చేయించు. నేను ఎంతో కాలం బతకలేనురా. పోయేటప్పుడు సొంత ఇంట్లో పోయానన్న తృప్తి నాకు మిగుల్చు. మీ నాయనకు పట్టిన గతి నాక్కూడా పట్టడం ఇష్టంలేదురా. ఈ అద్దె ఇళ్లతో పెద్ద చిక్కు. దగ్గటానికి లేదు. తుమ్మటానికి లేదు. ఇంటిని త్వరగా పూర్తి చేయరా" అంది విదురమ్మ మెల్లగా అంటూ.

"నేనూ అదే పని మీద ఉన్నానే" అన్నాడు కేశవరావు తల్లి వంక చూస్తూ.

తల్లితో ఆ మాట అన్నాడేగానీ ఇల్లు ఎలా పూర్తవుతుందో అనే భయం ఓ మూల ఉంది. 'కొడుకు పెళ్లి చేసి వచ్చే కట్నంతో ఇల్లుని పూర్తి చేయొచ్చు' అన్న ఒక ఆలోచన ఆయనకుంది. కానీ గత నాలుగేళ్ల నుంచి కొడుకు నిరుద్యోగంలో పడి కొట్టుమిట్టాడుతున్నాడు. 'గుడ్డి గుర్రానికి దాణా దండుగ' అన్నట్లు ఇప్పుడు కొడుకుని పోషించటమే కష్టంగా ఉంది. ఇంక పెళ్లి చేస్తే ఆ వచ్చేదాన్ని కూడా పోషించాలన్న ఆలోచనలతో కొడుకు పెళ్లి మాట పక్కన పెట్టాడు.

అప్పటివరకూ కొడుకు పక్కనే కూర్చుని ఉన్న విదురమ్మ "ఒరేయ్ కేశవా... వచ్చే శ్రావణ మాసం నాటికన్నా ఇల్లు పూర్తయ్యేటట్టు చూడరా.. మంచి రోజులు. మన వాళ్లందర్ని పిలిచి గృహప్రవేశం కూడా పెట్టుకోరా" అంది.

"గృహప్రవేశం అంటే తడిసి మోపెడు అవుతుంది. ఏదో నామమాత్రంగా పూజా కార్యక్రమం చేసి వెళ్లిపోతే బాగుంటుంది" అన్నాడు కేశవరావు.

"లేదురా... నా కొడుకు ఇల్లు కట్టుకున్నాడని పదిమందికీ తెలియాలి. ఖర్చులో ఖర్చు... గృహప్రవేశం కూడా పెట్టుకోరా" అంది విదురమ్మ అక్కడ నుంచి లేస్తూ.

తల్లి మాటలకు కేశవరావు ఎదురు చెప్పలేదు. ఇంటి ముందున్న వేప చెట్టు వంక చూస్తూ ఉండిపోయాడు. ఆయన మానసిక స్థితి చిక్కులుపడ్డ దారపు ఉండలాగా ఉంది.

ఇంతలో గోడ గడియారం తొమ్మిది గంట కొట్టింది. పడక కుర్చీలోంచి లేచాడు. ఫ్యాంట్, షర్ట్ వేసుకుని అద్దం ముందు నిలబడి నెత్తి మీదున్న కాసిని వెంట్రుకలను వెనక్కి దువ్వుకున్నాడు. సైకిలుని కిందకు దించుతుండగా కొడుకు వసారాలో కొచ్చి "ఓ పాతికివ్వు... ఇవ్వాళ ఓ ఇంటర్వ్యూకి వెళ్లాలి" అన్నాడు.

"ఎన్ని ఇంటర్వ్యూలో... ఎన్ని పాతికలో" అనుకుంటూ కేశవరావు జేబులోంచి పాతిక తీసిచ్చి ఆఫీసుకి బయలుదేరాడు.

❁ ❁ ❁

మధ్యాహ్నం లంచ్‌లో క్యారియర్ తెరుస్తున్న కేశవరావు పక్కనే సారథి కూర్చుంటూ "ఏమోయ్ రావూ... ఇల్లు ఎంత వరకూ వచ్చింది?" అన్నాడు.

"పునాదుల పని పూర్తయింది. ఇంక గోడలు, పైకప్పు మిగిలాయి." అన్నాడు కేశవరావు అన్నం కలుపుతూ.

"ఇప్పటివరకూ ఏమాత్రం అయిందేవిటి?"

"అవటానికే... యాభై పైనే అయింది. మిగతా పనులకీ ఎంత లేదన్నా ఓ లక్షదాకా కావచ్చు."

"మొత్తానికి అసాధ్యుడివేనయ్యా. 'ఇల్లు కట్టి చూడు. పెళ్లి చేసి చూడు' అన్నారు. కిందటేడు పెద్దమ్మాయి పెళ్లి చేశావు. ఈ ఏడు ఇల్లు మొదలెట్టావు" అన్నాడు సారథి.

ఆ మాటలకు కేశవరావు చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.

కొంతసేపయ్యాక సారథి సందేహాస్పదంగా మొహంపెట్టి "అవును రావూ... ఇంత డబ్బు ఎలా సమకూర్చున్నావు" అన్నాడు.

ఆ మాటలకు కేశవరావు "నీ దగ్గర దాపరికం ఎందుకూ... ఇల్లయితే మొదలెట్టాగానీ అది పూర్తయ్యే దారి కనబడటంలేదు. చేతిలో పైసా లేదు. అంతా దేవుడి మీద భారం వేశా" అన్నాడు మిత్రుని వద్ద తన ఆవేదన వెళ్లగక్కుతూ.

"ఎంత దేవుడి మీద భారం వేసినా మానవ ప్రయత్నం చెయ్యాలిగదా. ప్రస్తుత పరిస్థితుల్లో ఇల్లు కట్టడం అంటే మాటలు కాదు" అన్నాడు సారథి.

ఆ మాటలకు కేశవరావు సమాధానం చెప్పకుండా ఖాళీ అయిన క్యారియర్‌ని కడగటానికి అక్కడ నుంచి లేచాడు.

❁ ❁ ❁

అదే రోజు రాత్రి భోజనం చేసి నడుం వాల్చిన కేశవరావుకి, పదకొండు దాటినా నిద్ర రావడంలేదు. మంచం మీద అటూ ఇటూ దొర్లుతున్నాడు. మనస్సు కట్టాల్సిన ఇంటి చుట్టూనే తిరుగుతోంది. ఫ్యాన్ తిరుగుతున్నా గదంతా ఉక్కగా అనిపించింది. లేచి కిటికీ దగ్గరకొచ్చి నిలుచున్నాడు. కరెంట్ కోత వల్ల వీధి దీపాలు వెలగటంలేదు. అమావాస్య చీకటులు దట్టంగా కమ్ముకున్నాయి. ఆయన మనస్సు కూడా పెద్ద చీకటి గుడారంలాగా ఉంది.

విసుగ్గా వచ్చి మంచం మీద నడుము వాల్చాడు. వసారాలో పడుకున్న తల్లి ఎడతెరపి లేకుండా దగ్గుతోంది. లేచి తల్లి దగ్గరకొచ్చాడు. మంచం పక్కనే ఉన్న నీళ్ల గ్లాసుని చేతికి అందించాడు.

విదురమ్మ సగం తాగి గ్లాసుని చేతికిస్తూ "ఒరేయ్ కేశవా... నేను ఇంక బతకనురా" అంటూ మంచం మీద మెల్లగా వాలింది.

తల్లి దగ్గరనుంచి వచ్చి మంచం మీద పడుకున్న కేశవరావుకి ఒక్కసారిగా తల్లి మీద జాలి పుట్టుకొచ్చింది. తన బాల్యం గుర్తుకొచ్చింది. తండ్రి మరణం గుర్తుకొచ్చింది.

అప్పుడు కేశవరావు వయస్సు పదేళ్లు. తండ్రి ఓ చక్కెర ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తుండేవాడు. ముగ్గురు పిల్లలతో బొటాబొటి జీతంతో సంసారాన్ని నేర్పుగా నడుపుకొచ్చేది విదురమ్మ. అందరూ చిన్న పెట్టెలాంటి ఓ గదిలో కాలక్షేపం చేసేవారు.

అలా సాగుతున్న ఆ కుటుంబానికి అనుకోకుండా ఓ ఆపద ఎదురయింది.

అది వర్షాకాలం. మూడు రోజుల నుండి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆ రోజు కేశవరావు తండ్రికి నైట్ డ్యూటీ అవడం వల్ల, త్వరగా భోంచేసి గొడుగేసుకుని ఫ్యాక్టరీకి వెళ్లిపోయాడు. విదురమ్మ ముగ్గురు పిల్లలను అటూ ఇటూ వేసుకుని చాప మీద పడుకుంది.

అర్ధరాత్రి ఎవరో తలుపును బాదటంతో, విదురమ్మ అదుర్దాగా లేచి తలుపు తీసింది. భర్త శవాన్ని నలుగురు చేతుల మీద మోసుకొచ్చి మంచం మీద పడుకోబెట్టారు.



## తొలి చిత్రమే...

రాధ త్రివేండ్రంలోని కల్లర గ్రామంలో జన్మించింది. "అలయ్‌గళ్ ఓయ్వదిల్లై' అనే తమిళ చిత్రంలో మొదటిసారిగా నటించి కథానాయికగా తన నట జీవితాన్ని ప్రారంభించింది. ఆ వెనుక అసంఖ్యాకంగా తెలుగు చిత్రాలలో నటించి ప్రేక్షకులకు చేరువైంది.

"నాకు అభిమానుల నుంచి వస్తున్న ఉత్తరాలు చూస్తుంటే నా ఆనందానికి అవధులుండవు. తెలుగు రాకున్నా తెలుగు ప్రేక్షకుల నుంచి ఇంత ఆదరణ లభించడం నా అదృష్టంగానే భావిస్తాను" అన్నది రాధ.

సేకరణ: అట్లూరి శరత్‌బాబు

పనిలో ఉండగానే గుండెపోటు వచ్చి కుప్పకూలాడు విదురమ్మ భర్త. భర్త శవం మీద పడి ఒక్కసారిగా బావురుమని కన్నీరు మున్నీరుగా ఏడ్చింది విదురమ్మ.

ఏడుపు విని ఇంటి యజమాని బయటకొచ్చాడు. మడీ, ఆచారం అంటూ ఉండే ఆయన గదిలో శవాన్ని ఉంచటానికి ఎంతమాత్రం వీల్లేదన్నాడు.

విదురమ్మ కాళ్లా వేళ్లా పడి బతిమాలింది. ఆయన ససేమిరా వీల్లేదన్నాడు.

ఆ జోరున కురుస్తున్న వర్షంలో ఇంటి ముందున్న చిన్న పాకలో భర్త శవాన్ని పెట్టుకుని, భోరున తెల్లవార్లూ తల్లి విలపించటం కేశవరావు ఎప్పటికీ మరచిపోలేని సంఘటన.

విదురమ్మను మళ్లీ దగ్గు తెర ఆవహించింది. పక్కనే నిదురపోతున్న కేశవరావు కొడుకు లేచి "ఈ ముసిలిదాని దగ్గుతో ఛస్తున్నాం" అంటూ విసుక్కుని అక్కడి నుంచి మంచాన్ని తీసుకుపోయాడు.

కొడుకు మాటలు కేశవరావు చెవినబడ్డాయి. మనస్సు నొచ్చుకుంది. భర్తపోయిన తరువాత విదురమ్మ ఒంటి చేత్తో సంసారాన్ని ఈదింది. ఒంటరిగా, ధైర్యంగా బతికి పిల్లల్ని ప్రయోజకుల్ని చేసింది. అటువంటి తన తల్లి మీద కొడుకు విసిరిన మాటలు ఆయన హృదయాన్ని గాయపరచాయి. "పోయేటప్పుడు సొంత ఇంట్లోనైనా పోయానన్న తృప్తి నాకు మిగుల్చు" అన్న విదురమ్మ మాటలు అప్రయత్నంగా గుర్తుకొచ్చాయి.

తల్లి చనిపోయేలోగా ఇంటిని ఆరునూరైనా పూర్తి చెయ్యాలని, మనస్సులో ఆ క్షణాన గట్టిగా నిర్ణయం తీసుకున్నాడు కేశవరావు.

గోడ మీద గడియారం పన్నెండు గంట కొట్టింది. మంచినీళ్లు తాగుదామని లేవబోయిన కేశవరావుకి గుండెల్లో సన్నగా నొప్పి బయలుదేరింది. ఎడమ చేత్తో గుండెల మీద రుద్దుకుంటున్నాడు. ఒళ్లంతా చెమటలు పట్టాయి. ఊపిరిని తీసుకోవటం కష్టంగా ఉంది. చెప్పలేని నీరసం ఆవహించింది. అలా కలగకుండా మంచం మీదే కూర్చుండిపోయాడు ఆయన.

కొంతసేపయ్యాక నొప్పి తగ్గుముఖం పట్టింది. మెల్లగాలేచి ఓ గ్లాసెడు నీళ్లు తాగాడు. గాలి కోసం కిటికీ దగ్గరకొచ్చి నుంచున్నాడు. దూరంగా ఎక్కడు నుంచో కుక్క ఏడుపు చెవులకు వినపడింది.

❋ ❋ ❋

ఆ రోజు ఆదివారం. కేశవరావు, సారథి పార్కులో కూర్చున్నారు.

ముందుగా సారథీ సంభాషణను మొదలుపెడుతూ "ఏమిటి రావూ... ఏదో ముఖ్య విషయం మాట్లాడాలన్నావూ" అన్నాడు.

"అవును సారథీ. నేను వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుందామనుకుంటున్నా" అన్నాడు కేశవరావు.

"ఆలోచించే అంటున్నావా?"

"ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చాను. చూస్తుంటే మా వాడికి జన్మలో ఉద్యోగం వచ్చేట్టులేదు. ఇప్పటివరకూ వందకుపైగా ఇంటర్వ్యూలకి వెళ్లి ఉంటాడు. కన్నందుకు వాళ్ల భవిష్యత్తు గురించి ఆలోచించటం మన బాధ్యత. ఏమంటావూ?"

"అంటే నీ ఉద్యోగం కొడుక్కి ఇప్పిస్తాను అంటావు. వాడికి ఉద్యోగం ఇవాళ కాకపోయినా రేపైనా వస్తుంది. ఎవళ్ల భవిష్యత్తు వాళ్లే చూసుకోవాల్సిన రోజులవి. కాస్త ఆలోచించు! అయినా హఠాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఏమిటో నాకు అర్థం కావటం లేదు." అన్నాడు సారథి.

"అన్ని వైపులా ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చాను. రిటైర్ అవ్వగానే వచ్చే ఆ డబ్బుతో ఇంటిని పూర్తిచేద్దాం అనుకుంటున్నా" అన్నాడు కేశవరావు నిశ్చయంగా.

"సరే నీ ఇష్టం" అన్నాడు సారథి ఇక ఏమీ చెప్పలేనన్నట్టుగా.

వాచ్‌మన్ వచ్చి టైం అయిపోయిందనగానే ఇద్దరూ లేచి ఇళ్లకు బయలుదేరారు.

❋ ❋ ❋

అన్నట్టుగానే కేశవరావు వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. ఉద్యోగాన్ని కొడుక్కి ఇచ్చారు. స్వచ్ఛంద పదవీ విరమణ చేయగా వచ్చిన డబ్బుతో ఇల్లుని పూ... చేశాడు. ఇంక సున్నం వేయించట... తలుపులకు రంగులు వేయటం లాంటి చిన్నా చితక పనులు మిగిలాయి. వాటిని దగ్గరుం... చేయిస్తున్నాడు. గృహప్రవేశం చేయాల్సిన రోజు దగ్గరపడుతోంది. బంధుమిత్రులందరికీ ఆహ్వానం పంపాడు.

ఆ రోజు శుక్రవారం కేశవరావు గృహప్రవేశం చేసే రోజు. హడావిడిగా అటు ఇటూ తిరుగుతున్నాడు ఆయన. పక్కనున్న ఖాళీ స్థలంలో వంట ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇంటి ముందు వేసిన షామియానా కింద కుర్చీల్లో బంధువులు కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.

పురోహితుడు మంత్రాలు చదువుతుండగా కేశవరావు సతీసమేతంగా కొత్త పెంకుటింటిలోకి అడుగుపెట్టాడు.

ఆ మహా పట్టణంలో ఇల్లు కట్టినందుకు బంధువులు ఆయన్ని అభినందించి భోజనాలు చేసి వెళ్లిపోయారు.

విదురమ్మ ఆనందానికి అంతే లేదు. కొడుకు కట్టిన ఇల్లుని చూసి మురిసిపోయింది. ఇన్నాళ్లకి తనదని చెప్పుకునే ఓ సొంత గూడుని కొడుకుని ఏర్పరచుకున్నందుకు ఆమె సంతోషించింది. ఇల్లంతా పదిసార్లు తిరిగి చూసింది.

హడావుడి అంతా అయిపోయాకా, ఆ రోజు రాత్రి అందరూ కొత్త ఇంటిలో ఆదమరచి నిద్రపోతున్నారు. పక్క గదిలో కేశవరావు కూడా ఒళ్లు తెలియక మంచం మీద అడ్డంగా పడి నిద్రపోతున్నాడు. ఆ నిద్రలో హఠాత్తుగా ఆయనకు గుండె నొప్పి బయలుదేరింది. ఏదో బలమైన హస్తం గుండెని నొక్కిపెట్టినట్లు ఊపిరి ఆడటంలేదు. నొప్పిని భరించలేక మంచం మీద అటూ ఇటూ కొట్టుకుంటున్నాడు. అరుద్దామంటే గొంతు పెగలటంలేదు.

చివరకు బలవంతాన గొంతును పెకలించుకుని "అమ్మా!" అని అరచి మంచం మీదే ప్రాణాలు విడిచాడు. ఇంట్లో ఉన్న వాళ్లంతా ఒక్కసారిగా గొల్లుమన్నారు.

విదురమ్మ దుఃఖానికి అంతేలేదు. గుండెలను బాదుకుంటూ "అయ్యో బిడ్డా... కొత్త ఇల్లు కట్టుకున్నావు. ఆ ఇంట్లోనే కన్నుమూశావా. ఈ కట్టెను నీ చేతులతో సాగనంపుతావు అనుకున్నా... నా కళ్ల ముందే పోయావా.. బిడ్డా" అంటూ రోదిస్తోంది.

విదురమ్మ ఏడుపు విని చుట్టుపక్కల వాళ్లు వచ్చారు. చనిపోయిన కేశవరావు గురించి సానుభూతిగా మాట్లాడుకుంటున్నారు. విదురమ్మ ఏడ్చి సొమ్మసిల్లి పోయింది.

ఇంతలో గుంపులోంచి ఎవరో "శవాన్ని బయటకు తీసుకురండి. ఇంట్లో చచ్చిపోయాడు కనుక ఇంటిని కొన్నాళ్లు పాడుపెట్టాలి" అన్నారు. ◆




తల్లి: ఒరేయ్ సోమూ! టీవీ మీదంతా దుమ్ము పడిందేం?

సోము: ఈటీవీలో కార్ రేస్ చూపిస్తున్నారు, మమ్మీ!

— ముద్దా రమణమూర్తి (అనంతపురం)